క్లుప్తంగా

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జరిమానా

ఫిరంగిపురం: మద్యం తాగి వాహనం నడుపుతున్న ముగ్గురు వ్యక్తులకు నరసరావుపేట రెండో అడిషనల్ కోర్టు జడ్జి ఒక్కొక్కరికి రూ.10వేలు జరిమానా విధించినట్లు సీఐ రవీంద్రబాబు శనివారం తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో భాగంగా గ్రామంలో సిబ్బందితో వాహనాలు తనిఖీలు చేశామని మద్యం తాగి వాహనం నడుపుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారిని నరసరావుపేట రెండో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ముందు హాజరుపరిచామని చెప్పారు. వారికి కోర్టు ఒక్కొక్కరికి రూ.10వేలు జరిమానా విధించినట్లు తెలిపారు.

గంజాయి కేసులో వ్యక్తి అరెస్ట్



తాడేపల్లిరూరల్: గంజాయిని అక్రమంగా తరలిస్తూ పోలీసులకు చిక్కకుండా నాలుగు సంవత్సరాలుగా తప్పించుకు తిరుగుతున్న వ్యక్తిని ఎట్టకేలకు తాడేపల్లి పోలీసులు శనివారం అరెస్ట్‌చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తాడేపల్లి సీఐ కల్యాణ్‌రాజు మాట్లాడుతూ జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఉత్తర్వుల మేరకు టీంను ఏర్పాటు చేసి తాడేపల్లి పట్టణానికి చెందిన కట్టా రత్తయ్య (మీసాలోడు)ను తాడేపల్లి మార్కెట్ సెంటర్ ఆర్‌సీఎం చర్చి వద్ద అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అదుపులోకి తీసుకున్న రత్తయ్యను కోర్టుకు హాజరుపరిచి రిమాండ్‌కు పంపినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో తాడేపల్లి ఎస్ఐ ఖాజావలి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఎస్ఆర్ఎం బస్సు దగ్ధం



తాడికొండ: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో బస్సు మంటల్లో దగ్ధమైన ఘటన తుళ్లూరు మండలం నెక్కల్లు గ్రామ సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎస్ఆర్ఎం యూనివర్సిటీకి చెందిన బస్సులో ఉద్యోగులు విధులు ముగించుకొని తిరుగు ప్రయాణంలో ఇంటికి వెళుతుండగా ఒక్కసారిగా బస్సులో మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన సిబ్బంది వెంటనే కిందకి దిగి, ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది మంటలార్పేందుకు యత్నించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తుళ్ళూరు సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



తాడేపల్లిరూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు అన్నారు. శనివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు తమకు న్యాయంగా రావాల్సిన బకాయిలను చెల్లించాలని కోరుతూ నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎన్నికల ముందు నారా లోకేష్ కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్య పరిష్కారం కాకపోవడం విచారకరమన్నారు. కార్మికుల సమస్యను ప్రభుత్వం పరిష్కరించకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఎం.ఆశీర్వాదం, అక్కయ్య, గురవయ్య, రమాదేవి, లక్ష్మి, రమణ, శివకుమారి, దుర్గాభవానీ, సుబ్బారావు, అగ్గయ్య, ఇస్మాయేల్, ఆదినారాయణ, సులేమాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి



ఫిరంగిపురం: ప్రతి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని వైద్యురాలు శ్వేత అన్నారు. మండలంలోని ఫిరంగిపురం పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో ఎన్‌సీడీసీడీ ప్రోగ్రాంలో భాగంగా ఆరోగ్యసిబ్బంది శనివారం ఇంటింటికి వెళ్లి పరీక్షలు చేసి వాటిని యాప్‌లో నమోదు చేశారు. ప్రతి ఒక్కరికి ఉన్న అనారోగ్య సమస్యలు, వాడుతున్న మందులు, తీసుకుంటున్న జాగ్రత్తలు గురించి సిబ్బంది వివరాలు తెలుసుకుని వాటిని సంబంధిత యాప్‌ల్లో నమోదు చేస్తున్నారని తెలిపారు. ఇప్పటివరకు 31,227 మంది సమాచారం గురించి యాప్‌లో వివరాలు నమోదు చేయాల్సి ఉండగా ఇప్పటివరకు 11,435మంది వివరాలు నమోదు చేశామని చెప్పారు.

పనిభారం.. ఒత్తిడి తీవ్రం!

- అరకొర వేతనాలే దిక్కు
- అదనపు పనులతో ఉక్కిరిబిక్కిరి
- వివిధ సర్వేలు చేస్తున్నా ఏళ్లుగా అందని పారితోషికాలు
- పట్టించుకోని ప్రభుత్వం

వెట్టి చాకిరి చేస్తున్న ఆశా వర్కర్లు

తాడేపల్లిరూరల్: ఆరోగ్య రంగంలో ప్రాథమిక స్థాయిలో వైద్యసేవలు నిర్వహించే ఆశా వర్కర్లు తీవ్రమైన పనిభారం, ఒత్తిడితో అనారోగ్యాలకు గురవుతున్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ బాధ్యతలు చూస్తూ మాతా, శిశు మరణాలు తగ్గించడంలో కీలక పాత్ర పోషించేవీరు రాజకీయ ఒత్తిళ్లు ఎదుర్కొంటూ, ఉద్యోగ అభద్రత పరిస్థితులు ఎదుర్కొంటున్నారు.

వైద్య సేవల్లో కీలక పాత్ర

ఆశా వర్కర్లు వారి పరిధిలో 12 వారాల లోపు గర్భిణులను గుర్తించి నమోదు చేయిస్తారు. గర్భిణుల ఆరోగ్య పరిస్థితులపై నిర్దేశిత సమయంలో పర్యటనలు చేస్తూ వారిని అప్రమత్తం చేస్తారు. గర్భిణులను ప్రోత్సహించి ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలు జరగడంలో వీరిదే కీలకపాత్ర. ప్రసవించిన తర్వాత బాలింతలకు జాగ్రత్తలు, అవగాహన కార్యక్రమాలు, 42 రోజుల్లో ఏడుసార్లు దఫాలుగా విజిట్ చేసి వారికి శిశువుల పరిశుభ్రత, భద్రతపై అవగాహన కల్పించడం, 45 రోజులలోపు వేయవలసిన టీకాలు వేయించే పనులు, వివాహమైన జంట,



తాడేపల్లి నులకపేట ఇండస్ట్రియల్ కాలనీలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న ఆశా వర్కర్

పిల్లలు పుట్టకుండా ఎవరైనా ఉంటే వారి వివరాలను సర్వే చేయడం, పిల్లల ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ లాంటి కార్యక్రమాలు చేపడతారు. అయితే వీటితో బాటు అదనపు పనులతో తీవ్ర స్థాయిలో సతమతమవుతున్న పరిస్థితులు నెలకొన్నాయని ఆశా వర్కర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిలిచిన పారితోషికాలతో ఇక్కట్లు..

ఈ–ఆశ యాప్‌లో 9 రకాల పనులను వీరు చేసేలా జాబ్‌చార్ట్ ఉంది. కానీ ప్రభుత్వం వివిధ రకాల సర్వేలను చేయిస్తూ కనీసం పారితోషికాలు కూడా ఇవ్వడం లేదు. నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)లో భాగంగా పలు జాతీయ కార్యక్రమాల్లో పాల్గొంటున్న ఆశా వర్కర్లకు గత రెండేళ్లుగా ఎటువంటి పారితోషికాలు చెల్లించడం లేదు. ఇటీవల నిర్వహించిన జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని రోజుకు రూ. 75 చొప్పున మూడు రోజుల పాటు ఇవ్వాలి ఉంది. అలాగే పల్స్‌పోలియో కార్యక్రమానికి, ఫైలేరియా మాత్రల పంపిణీ కార్యక్రమానికి, 15 రోజుల పాటు చేస్తున్న లెప్రసీ సర్వేకు పారితోషికాలు ఇవ్వాల్సి ఉంది. లెప్రసీ అవగాహన కార్యక్రమంలో భాగంగా సర్వే నిమిత్తం వర్కర్లకు ముందుగా అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తారు. ఇందుకోసం టీఏ, డీఏ రూ. 150 ఇవ్వాల్సి ఉంటుంది. అయితే రెండేళ్లుగా జాతీయ కార్యక్రమాలకు ప్రభుత్వం వీరికి ఒక్క రూపాయి కూడా పారితోషికం ఇవ్వలేదు. అలాగే టీబీ మందుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా 6 నెలల మందులు వాడిన తర్వాత సదరు వ్యక్తికి క్లియరెన్స్ సర్టిఫికేట్ వస్తుంది. ఇందు నిమిత్తం రూ. 1000 పారితోషికంగా ఆశా వర్కర్లకు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ 2014 నుంచి ఈ సొమ్ములు ప్రభుత్వం ఇవ్వడం లేదు. ఇలా అదనపు పనులను చేయించుకుంటున్నప్పటికీ ఆశా వర్కర్లకు ఎటువంటి పారితోషికం అందకపోవడం శోచనీయమని పలువురు కార్మిక సంఘాల నేతలు మండిపడుతున్నారు.

పని ఒత్తిడి తగ్గించాలి

వివిధ సర్వేల పేరుతో నిరంతరం పనిచేస్తున్నాం. లెప్రసీ, టీబీ, మలేరియా, ఎంసీబీ, పిల్లల ఎమ్యునైజేషన్ వంటి సర్వేలు చేస్తున్నాం. అలాగే ప్రతి గురువారం ప్రభుత్వ పాఠశాలల్లో ఐరన్ టాబ్లెట్లు ఇస్తున్నాం. ఏఎన్ఎంలు చేయాల్సిన పనులు కూడా ఆశా వర్కర్లు చేస్తున్నారు. ఆశా వర్కర్లపై ప్రభుత్వం పని ఒత్తిడి తగ్గించాలి.

– లక్ష్మి, సీతానగరం





వెంటనే పారితోషికాలు ఇవ్వాలి

ఎన్‌హెచ్‌ఎం కార్యాలయంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న అన్ని జాతీయ సర్వేలలో, వైద్య సేవల్లో పాల్గొంటున్నాం. కానీ మాకు పారితోషికాలు ఇవ్వడం లేదు. ప్రస్తుతం ప్రభుత్వం ఇస్తున్న రూ.10 వేల వేతనంతోనే సరిపెట్టుకుంటున్నాం. కేంద్ర ప్రభుత్వం నిర్వహించే సర్వేలకు సంబంధించి రావాల్సిన బకాయిలను వెంటనే ఇవ్వాలి.

– రేణుక, నులకపేట

ఓటు హక్కుపై అవగాహన అవసరం

మంగళగిరి టౌన్: విద్యార్థి దశ నుంచే ఓటుహక్కుపై అవగాహన అవసరమని డిస్ట్రిక్ట్ స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డీఎస్‌డీఓ) సంజీవరావు అన్నారు. మంగళగిరి నగర పరిధిలోని వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాలలో శనివారం ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు స్వీప్ పేరుతో విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్‌డీఓ సంజీవరావు మాట్లాడుతు ఓటు హక్కు మాత్రమే కాదని, ఒక సామాజిక బాధ్యతగా గుర్తించాలని అన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. 100 శాతం నమోదు, పోలింగ్ లక్ష్యంగా ప్రణాళికతో ముందుకు వెళుతున్నామని పేర్కొన్నారు. మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ కె.శకుంతల మాట్లాడుతు ప్రజాస్వామ్యానికి ఓటు పునాది అని, ఓటు అనే రెండు అక్షరాల పదం దేశ భవిష్యత్తును మార్చేస్తుందన్నారు. కుల, మత, ప్రాంత,



స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న డీఎస్‌డీఓ సంజీవరావు

లింగ, జాతి, భాష అనే భేదం లేకుండా దేశంలో నివసించే 18 సంవత్సరాలు నిండిన పౌరులందరికి భారత రాజ్యాంగం ఓటు హక్కు కల్పించిందని, అర్హులందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. అనంతరం విద్యార్థులకు ఓటు హక్కు, బ్యాలెట్‌పై అవగాహన కల్పించారు. వీజీటీఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ధర్మభిక్షం జయంతి వేడుకలు

మంగళగిరి టౌన్: జాతీయ గీత పనివారల సంఘం వ్యవస్థాపకులు, పార్లమెంట్ మాజీ సభ్యుడు, కామ్రేడ్ బొమ్మగాని ధర్మభిక్షం 103వ జయంతి వేడుకలు మంగళగిరిలో శనివారం ఘనంగా నిర్వహించారు. పట్టణ పరిధిలోని సీతారామ కోవెల వద్ద వున్న గౌతు లచ్చన్న కమ్యూనిటీ హాల్‌లో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు హాజరై ధర్మభిక్షం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిజాం పాలనకు వ్యతిరేకంగా ప్రజల పక్షాన నిలబడి పోరాడిన యోధుడు కామ్రేడ్ ధర్మభిక్షం అని కొనియాడారు. పార్టీలు, కులమతాలకతీతంగా కామ్రేడ్ ధర్మభిక్షాన్ని తెలంగాణ ప్రజలు గొప్ప విప్లవకారుడిగా ఆరాధించేవారని అన్నారు. 11వ లోక్‌సభ ఎన్నికల్లో నల్గొండ నుంచి పోటీ చేసి భారీ మెజారిటీతో గెలుపొందారని అన్నారు. రెండుసార్లు పార్లమెంట్ సభ్యుడిగా, మూడుసార్లు శాసనసభ్యుడిగా పనిచేసిన ధర్మభిక్షం ప్రజల్ని ఐక్యం చేసి



జయంతి సభలో మాట్లాడుతున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు

నైజాం నిరంకుశ రాక్షస పాలనకు వ్యతిరేకంగా పోరాడి జైలు శిక్షను సైతం అనుభవించారని అన్నారు. సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య, పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్, రాష్ట్ర చేతి వృత్తుల సంఘం కార్యదర్శి రామాంజనేయులు, రాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షుడు వాకా రామగోపాల్ గౌడ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన అంగన్‌వాడీలకు శిక్షణ

మంగళగిరి: నగర పరిధిలోని కాజ ప్రభుత్వ పాఠశాలలో మూడు రోజుల పాటు జరిగిన అంగన్‌వాడీల శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. పోషణ భీ, పఢాయి భీ కార్యక్రమంపై జరిగిన శిక్షణలో పిల్లల్లో అంగవైకల్యాన్ని ఎలా గుర్తించాలి, ఎటువంటి ఆహారం తీసుకోవాలి, వారితో ఎలా మాట్లాడాలి, పిల్లలకు పోషకాహార లోపం, పోషకాహారం ప్రాముఖ్యత, దివ్యాంగ పిల్లలను ఎలా గుర్తించాలి, వారి పోషకాహారం తదితర అంశాలకు సంబంధించిన వివరాలను హెల్త్ డిపార్ట్‌మెంట్ అధికారి డాక్టర్ జయరాజు అవగాహన కల్పించారు. అంగనవాడీ టీచర్లు పేపర్‌తో పలు రకాల పరికరాలను తయారు చేశారు. అనంతరం స్వచ్ఛ భారత్‌లో భాగంగా అందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు వి.శ్రీదేవి, జి.వేణుకుమారి, అంగనవాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడు, అల్లంవారిపాలెం గ్రామాల్లో శనివారం మూడోరోజు అంగన్‌వాడీలకు పోషణ భీ పఢాయి భీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పలు అంశాలను గురించి అంగన్‌వాడీ సూపర్ వైజర్ మహాలక్ష్మీ మాట్లాడుతూ చిన్నారుల్లో వచ్చే వైకల్యాలను ఏవిధంగా గుర్తించాలనే దానిపై అవగాహన కల్పించారు. నుదురుపాడు గ్రామంలో అంగన్‌వాడీలకు పలు అంశాలపై అవగాహన కార్యక్రమంలో భాగంగా వైద్యాధికారి యానీ గ్రేస్ పాల్గొని వివరించారు. అంగన్‌వాడీలు పలు నైపుణ్యాలు పెంచుకోవాలని చెప్పారు. 21 రకాల వైకల్యాలను గురించి తెలియజేశారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ డి.సునీత, సీహెచ్ఓ వెంకటలక్ష్మి, కె.సుధాకరరాజు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు

మేడికొండూరులో...

మేడికొండూరు: ఫిరంగిపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ మేడికొండూరు సెక్టార్ అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడు రోజులు పోషన్ భీ – పఢాయి భీ శిక్షణ కార్యక్రమం శనివారం మేడికొండూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరిగింది. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.హేమలత భాస్కర్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రైవేటు ఉపాధ్యాయుల గుర్తింపునకు కృషి

కేఎస్ లక్ష్మణరావు

తాడేపల్లిరూరల్: రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు పాఠశాలల్లో వున్న 1.20లక్షల మంది ప్రైవేటు ఉపాధ్యాయులకు గుర్తింపు ఇచ్చేందుకు, వారి సమస్యలపై కృషి చేస్తానని కృష్ణ–గుంటూరు ఉమ్మడి జిల్లాల పీడీఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు అన్నారు. శనివారం తాడేపల్లి రూరల్ పరిధిలోని కుంచనపల్లి అరవింద హైస్కూల్‌లో సీబీఎస్సీ, స్కూల్ టీచర్లు, యూటీఎఫ్, ప్రజా సంఘాల నాయకులతో కలసి ఆయన విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ 2007 వరకు లెక్చరర్‌గా పనిచేసిన తాను గత 14 ఏళ్లుగా ఎమ్మెల్సీగా శాసనమండలిలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్స్, అంగన్‌వాడీలు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపైనే కాక స్థానికంగా అన్ని వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై ప్రజల గొంతుకై పనిచేశానన్నారు. ఈనెల 27వ తేదీన జరిగే ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు తనకు వేసి గెలిపించాలని కోరారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాశం రామారావు, యూటీఎఫ్ నాయకులు ఆంజనేయులు, డి.మాలకొండయ్య, సీఐటీయూ తాడేపల్లి మండల నాయకులు దొంతిరెడ్డి వెంకట రెడ్డి, కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, రైతు సంఘం మండల నాయకులు డోకిపర్తి రాజేంద్రబాబు, కేవీపీఎస్ నాయకులు నాగపోగు విజయరాజు, రాజు, సీఐటీయూ తాడేపల్లి పట్టణ నాయకులు దొంతిరెడ్డి విజయ భాస్కరరెడ్డి, పల్లె భార్గవ్, అరవింద స్కూల్ కరస్పాండెంట్ బి.ఇంద్రాణి, చాగంటి అరవింద్, అరవింద స్కూల్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు

మంగళగిరిలో...

మంగళగిరి టౌన్: శాసనమండలిలో అన్ని వర్గాల ప్రజల సమస్యలను ప్రస్తావించి, పరిష్కరించే దిశగా కృషి చేస్తానని కృష్ణ, గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు అన్నారు. మంగళగిరి నగర పరిధిలోని ప్రైవేటు, ప్రభుత్వ విద్యాసంస్థల్లో శనివారం యూటీఎఫ్, వివిధ సంఘాల ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. నగరపరిధిలోని వీజేపీ డీఎల్‌బీ డిగ్రీ కళాశాల, నిర్మల జూనియర్ కళాశాల, సీకే గరల్స్ హైస్కూల్, సీకే జూనియర్ కళాశాల, వీవర్స్ కాలనీలోని వీవర్స్ హైస్కూల్ తదితర పాఠశాలల ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. యూటీఎఫ్, సీఐటీయూ, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలి

11వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి. శ్రీనివాసులు

తెనాలిరూరల్: మార్చి 8న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి. శ్రీనివాసులు న్యాయవాదులను కోరారు. తెనాలి కోర్టు సముదాయంలో శనివారం న్యాయవాదులతో ఆయన సమావేశమయ్యారు. లోక్ అదాలత్‌లో కేసులు రాజీపడితే కోర్టు ఫీజులు సైతం వాపసు వస్తాయని, కక్షిదారులకు దీనిపై అవగాహన కల్పించాలని సూచించారు. రాజీ అయ్యే వీలున్న కేసులన్నింటిని అదాలత్‌లో పరిష్కరించుకునేలా కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవడం ద్వారా సమయంతో పాటు డబ్బులు ఆదా అవుతాయని స్పష్టం చేశారు. అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా చొరవ చూపాలని కోరారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్, దాసరి శ్రీధర్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.



న్యాయవాదులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాసులు

పేపర్ రహిత పాలనతో ప్రకృతిని కాపాడుదాం

చేనేత, జౌళిశాఖ అదనపు సంచాలకులు ఎ.మురళీకృష్ణ

మంగళగిరి టౌన్: పేపర్ రహిత పాలనతో ప్రకృతిని కాపాడుకుందామని చేనేత జౌళి శాఖ అదనపు సంచాలకులు ఎ.మురళీకృష్ణ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం మంగళగిరిలోని చేనేత, జౌళి శాఖ కమిషనర్ కార్యాలయ సిబ్బందితో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కార్యాలయ ఆవరణను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ కార్యాలయాన్ని అందంగా, పరిశుభ్రంగా తీర్చిదిద్దుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. కార్యాలయంలోని ఫైళ్లను, ఫర్నిచర్‌ను క్రమపద్ధతిలో ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. చేనేత జౌళి శాఖ సంయుక్త సంచాలకులు కె.కన్నబాబు, ఉప సంచాలకులు బి.నాగేశ్వరరావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తడి, పొడిచెత్తపై అవగాహన...

మంగళగిరి టౌన్: పరిసరాల పరిశుభ్రత కోసమే స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ కె. శకుంతల అన్నారు. ప్రతి నెల మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ నిర్వహించాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళగిరి నగర పరిధిలోని వివిధ ప్రాంతాల్లో కార్యాలయ సిబ్బందితో స్వచ్ఛతపై అవగాహన నిర్వహించారు. మంగళగిరి నగర పరిధిలోని పార్కురోడ్డు, సీతారామ కోవెల, మెయిన్ బజార్, పరిధిలోని వివిధ ప్రాంతాల్లో స్థానికులకు తడిచెత్త, పొడిచెత్త, గృహ హానికర వ్యర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పారిశుద్ధ్య కార్మికులతో ప్రతిజ్ఞ చేయించారు. ఏసీపీ అంజనా జేమ్స్, ఎంటీఎంసీ సెక్రటరీ కుమారి, వివిధ విభాగాల శాఖాధిపతులు, సచివాలయ సిబ్బంది, నగరపాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.



కార్యాలయ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న మురళీకృష్ణ

ఫిరంగిపురంలో...

ఫిరంగిపురం: తడిచెత్త, పొడిచెత్తపై ప్రజలకు అవగాహన అవసరమని ఎంపీడీఓ వెంకటేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలోని వసంతనగర్‌లో స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఎంపీడీఓ వెంకటేశ్వరరావు అవగాహన కల్పించారు. తహసీల్దార్ జె.ప్రసాదరావు, ఈఓపీఆర్డీ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు. వేమవరంలోని ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు పరిసరాలు శుభ్రత, తడి,పొడి చెత్త వేరుగా చేయడం, ఆరోగ్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు హెచ్ఎం దివి. కమల్‌మోహన్ వివరించారు. పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ జె.సుబ్బయ్య, పంచాయతీ కార్యదర్శి శౌరిజోజి పాల్గొన్నారు.

జోసిల్ కంపెనీలో...

మేడికొండూరు: మండల పరిధిలోని డోకిపర్రు గ్రామ సమీపంలో ఉన్న జోసిల్ కంపెనీ పరిసర ప్రాంతంలో స్వచ్ఛ ఆంధ్ర దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. గుంటూరు జిల్లా ఫ్యాక్టరీల ఉప తనిఖీ అధికారి ఆదేశాల మేరకు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నిర్వహించే స్వచ్ఛ ఆంధ్ర దినోత్సవం కార్యక్రమంలో భాగంగా కంపెనీ అన్ని విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు కార్యక్రమంలో పాల్గొని అవగాహన ర్యాలీ నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతపై విస్తృత ప్రచార ర్యాలీ నిర్వహించారు. కంపెనీ ప్రాంగణంలోని పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. కంపెనీ అధికారులు, కార్మికులు కలిసి శ్రమదానంలో పాల్గొన్నారు. స్వచ్ఛమైన పరిసరాలు ఆరోగ్యవంతమైన జీవనానికి దోహదపడతాయని యడ్లపాటి భాను ప్రసాద్ కార్మికులకు తెలిపారు. సెక్రటరీ కోటా రఘురాం, మేనేజర్లు, ఇంజినీర్లు, సూపర్‌వైజర్లు, కార్మికులు పాల్గొన్నారు.



జోసిల్ కంపెనీ పరిసర ప్రాంతాలను శుభ్రం చేస్తున్న అధికారులు, కంపెనీ కార్మికులు

మేడికొండూరులో...

మేడికొండూరు: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మేడికొండూరు తహసీల్దార్ హరిబాబు అన్నారు. మండల పరిధిలోని పేరేచర్ల జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర దినోత్సవ కార్యక్రమం పాఠశాల అధ్యాపకులు నిర్వహించారు. కార్యక్రమానికి తహసీల్దార్ హరిబాబు హాజరై మాట్లాడారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల ఆవరణలో శుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈవోపీఆర్డీ పూర్ణ శంకరరావు, వీఆర్ఓ జాన్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిశుభ్రతపై అవగాహన అవసరం



తాడేపల్లిరూరల్: భావితరాలకు పర్యావరణ పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ అన్నారు. శనివారం తాడేపల్లిలోని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని సిబ్బందితో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా కూర్మనాథ్ మాట్లాడుతూ దేశంలోనే అత్యంత పరిశుభ్ర రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారని అన్నారు. ఫిబ్రవరి నెల సోర్సు రీసోర్సు థీమ్‌లో భాగంగా రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని నీరు వృథా కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం కార్యాలయ ప్రాంగణం, పరిసరాలను సిబ్బందితో కలసి శుభ్రం చేశారు.

అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి

రేపల్లె డీఎస్పీ శ్రీనివాసరావు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

రేపల్లె రూరల్: ప్రతి ఒక్కరూ అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలని, తమ పరిసరాలలో అనుమానాస్పద స్థితిలో సంచరించే వారి వివరాలను పోలీసు స్టేషన్‌లో తెలియజేయాలని రేపల్లె డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు అన్నారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు రాత్రి పల్లె నిద్ర కార్యక్రమంలో భాగంగా రేపల్లె పట్టణంలోని ప్రకాశం మున్సిపల్ స్కూలు ఆవరణలో శుక్రవారం పట్టణ ప్రజలతో మాట్లాడారు. ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం పెరిగిందని, అదే విధంగా సైబర్‌నేరాలు పెరిగాయని హెచ్చరించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అవసరం మేరకు మాత్రమే వినియోగించాలని, అవసరం లేని విషయాలలో ఈ పరిజ్ఞానాన్ని వినియోగిస్తే మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు.

రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు తప్పనిసరి



చెరుకుపల్లి: రైతులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను పొందాలంటే ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యను పొందాలని ఎంపీడీఓ షేక్ మహబూబ్ సుభానీ తెలిపారు. వ్యవసాయ శాఖ, పంచాయతీ రాజ్, మండల పరిషత్‌శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు విశిష్ట సంఖ్య నమోదు (ఫార్మర్ రిజిస్ట్రీ) ప్రచారాన్ని మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని పూర్తిగా ఆధునికీకరణ చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం రైతులకు 14 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్యను అందిస్తుందన్నారు. సొంత భూమి కలిగిన ప్రతి రైతు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వివిధ పథకాలు, రాయితీలు పొందాలంటే 14 అంకెల విశిష్ట సంఖ్య నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని చెప్పారు. ఈ నెల 25వ తేదీలోగా నమోదు చేయించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అవ్వారు మహేష్‌బాబు పాల్గొన్నారు.